# ఈనాడు నంద్యాల

గురువారం అక్టోబరు 10, 2024




## మక్కలు.. ఆరక చిక్కులు



తడిసిన మొక్కజొన్నలను కుప్ప చేస్తున్న రైతులు

రైతన్నలు ఆరుగాలం కష్టించి పండించిన మొక్కజొన్న దిగుబడులను ఆరబెట్టుకునేందుకు అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌యార్డుల్లో వసతులు లేకపోవడం శాపంగా మారింది. కల్లాలు లేని కర్షకులు రహదారులపైనే దిగుబడులు ఆరబోస్తున్నారు. మూడు రోజులుగా పడుతున్న వర్షాలతో మొక్కజొన్నలు ఆరడం లేదని రైతులు వాపోతున్నారు. పలు ప్రాంతాల్లో పట్టలు కప్పి ఉంచిన దిగుబడులు వాననీటిలో తడిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కురిసిన వర్షానికి రహదారులు, కల్లాల్లో ఆరబోసుకున్న మొక్కజొన్నలు కళ్లెదుటే తడిసిపోయాయని కన్నీరుపెట్టారు. మహానంది ఫారం నుంచి బోయిలకుంట్ల మెట్ట వరకు సుమారు 8 కిలోమీటర్ల దూరం వరకు రహదారిపై ఆరబోసిన దిగుబడులను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. ఆళ్లగడ్డ-అహోబిలం రహదారిపైన రైతులు మొక్కజొన్నను ఆరబెట్టగా... బుధవారం కురిసిన వర్షానికి గింజలన్నీ తడిసిపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.



ఆళ్లగడ్డ-అహోబిలం రహదారిపై మొక్కజొన్నపై పట్టాలు కప్పిన రైతులు

– న్యూస్‌టుడే, మహానంది, ఈనాడు, కర్నూలు

## 14న జాతీయ అప్రెంటిస్ మేళా

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 14న ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ప్రసాద రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలలోని పలు కంపెనీలు రానున్నాయని, అభ్యర్థులు ఒరిజినల్ ఎస్ఎస్‌సి, ఐటీఐ పాస్ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ, అభ్యర్థి బ్యాంకు పాస్‌బుక్, ఆధార్, పాన్‌కార్డులు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలు, బయోడేటాతో హాజరవ్వాలన్నారు. ఐటీఐ పాసై ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొనని వారికి అప్రెంటిస్‌షిప్ రిజిస్ట్రేషన్ చేయించనున్నట్లు తెలిపారు.



పథకం.. ఫలప్రదం

ఆసనాల విన్యాసం.. పతకాల కైవసం

- 16లో


# సాగని పరిశోధనలు

- చెదిరిన ఆర్ఏఆర్ఎస్ చరిత్ర
- భూములు పంచేసిన వైకాపా
- శాస్త్రవేత్తల అవస్థలు





– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

120 ఏళ్ల చరిత్ర ఉన్న నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రానికి (ఆర్ఏఆర్ఎస్) గత పాలకులు ఉరేశారు. సారవంతమైన భూములు ధారదత్తం చేసి పరిశోధనలు ప్రశ్నార్థకంగా మార్చారు. ఆర్ఏఆర్ఎస్‌కు ఏళ్ల కిందట కేటాయించిన 114 ఎకరాలు కేటాయించారు. ప్రాంగణమంతా నల్లరేగడితో కూడుకొని ఉన్న నేలలు ఉండటంతో పత్తి, పప్పు ధాన్యాలు, పొద్దుతిరుగుడు, రాగులు, సజ్జలు, కొర్రలు, కందులు, పొగాకు తదితర పంటలపై పరిశోధనలు చేసేవారు. ఆరు తడి పంటలు ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు వచ్చేది. ఇక్కడ జరిగే విత్తనోత్పత్తి దేశానికి మార్గదర్శకంగా ఉండేది. తెగుళ్లను తట్టుకోవడంతో పాటు కాలానికి అనుగుణంగా మొక్క తన స్వభావాన్ని మార్చుకుని దిగుబడులు ఇచ్చే విధంగా ఉండేది. 2022లో గత ప్రభుత్వం ఆర్ఏఆర్ఎస్ ప్రాంగణంలో 50 ఎకరాలను వైద్య కళాశాలకు కేటాయించింది. ఆర్ఏఆర్ఎస్ భవనాల్లోనే కలెక్టరేట్ ఏర్పాటు చేయడంతోపాటు 11 ఎకరాలు కేటాయించడం గమనార్హం. వైకాపాకు చెందిన కొందరు తమ భూములకు విలువ పెంచుకోవాలన్న స్వార్థంతో పరిశోధన కేంద్రాన్ని నిర్వీర్యం చేశారు. రైతు మేలుకోరే శాస్త్రవేత్తలు పరిశోధనల కోసం ప్రైవేటు పొలాలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



వైద్య కళాశాలకు కేటాయించిన భూములు

### ఒక్కొక్కరు అర ఎకరంలో కానిచేస్తున్నారు

పరిశోధన కేంద్రంలో 21 మంది శాస్త్రవేత్తలు ఉన్నారు. నిబంధనల మేరకు ఒక్కొక్కరికి ఐదు ఎకరాల పొలం కేటాయించాలి.. అందులో పత్తి, కొర్ర, పొద్దుతిరుగుడు, పొగాకు, రాగులు, పప్పు ధాన్యాలు, శనగ వంటి పంటల విత్తనోత్పత్తి, పరిశోధనలు చేయాల్సి ఉంటుంది. వైద్య కళాశాలకు 50 ఎకరాలు కేటాయించగా.. మరో 20 ఎకరాల్లో భవనాలు ఉన్నాయి. ప్రస్తుతం పరిశోధన కేంద్రంలో 40 ఎకరాల పొలం మిగింది. ప్రస్తుతం ఒక్కో శాస్త్రవేత్త అర ఎకరంలో పరిశోధన చేస్తున్నారు.

### ఆ ఇద్దరి భూముల విలువ రెట్టింపు

○ 2022 ఏప్రిల్ 4న నంద్యాల జిల్లా కేంద్రం ఏర్పాటైంది. తమ భూముల విలువ పెంచుకోవడానికి వైకాపాకు చెందిన ఇద్దరు ప్రముఖ నేతలు వ్యూహంతో ముందుకెళ్లారు. తాత్కాలికం పేరుతో ముందుగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్ఏఆర్ఎస్)లో కలెక్టరేట్‌ను ఏర్పాటు చేయించారు. దీన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకించినా వినిపించుకోలేదు..

○ ఆర్ఏఆర్ఎస్‌కు అతి సమీపంలోనే వారికి భూములున్నాయి. ఒకరికి 25 ఎకరాలు, మరికొరికి 50 ఎకరాలు ఉన్నాయి. అక్కడ కలెక్టరేట్ ఏర్పాటు కాకముందు ఎకరం భూమి రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్లు పలికేది. రెండేళ్లలో రూ.13 కోట్ల నుంచి రూ.15 కోట్లకు పెరగడం గమనార్హం.

○ ఓ నాయకుడికి ఆ ప్రాంతంలో ఆసుపత్రి, హోటల్, వ్యాపార సముదాయాలు ఉన్నాయి. వాటన్నింటి విలువ రెట్టింపయ్యింది. వారిద్దరికి కలెక్టరేట్‌కు మరికొంత దూరంలో పెద్ద ఎత్తున వెంచర్లు ఉన్నాయి.

### విత్తనోత్పత్తి

- వైద్య కళాశాలకు కేటాయించిన 50 ఎకరాల్లో పత్తి, కొర్ర, పొద్దుతిరుగుడు పంటలు సాగు చేసి విత్తనోత్పత్తికి వినియోగించేవారు. ఎకరాకు ఎనిమిది నుంచి పది క్వింటాళ్ల వరకు విత్తనోత్పత్తి సాధించేవారు. చేసేదిలేక మహానంది వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో పదెకరాలు తీసుకొని ఆయా పంటలకు సంబంధించి విత్తనోత్పత్తి, పరిశోధనలు చేస్తున్నారు. అక్కడా పొలం సరిపోకపోవడంతో రైతుల నుంచి పొలాలు లీజుకు తీసుకున్నారు. సారవంతమైన భూములు మరొకరికి ఇచ్చి ప్రస్తుతం వేరోచోట శాస్త్రవేత్తలు ప్రయోగాలు, పరిశోధనలు చేస్తుండటం గమనార్హం.
- శాస్త్రవేత్తలు ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది. పత్తి సాగుకు 150 రోజుల సమయం పడుతుంది. ఖరీఫ్‌లోనే సాగు చేయాల్సి ఉంటుంది. ఆర్ఏఆర్ఎస్ విశాలమైన ప్రాంగణం కావడంతో రెండు సీజన్లకు విడివిడిగా పంటలు వేసి పరిశోధనలు చేసేవారు. దీంతో ఏడాది పొడవునా పరిశోధన ప్రక్రియ కొనసాగేది. ప్రస్తుతం ఆ అవకాశం లేకుండా పోయింది.
- ఆర్ఏఆర్ఎస్ భూములు నల్లరేగడితో కూడుకున్నవి.. పరిశోధనలకు నేలలు ఎంతో అనువైనవి. మహానంది వ్యవసాయ కళాశాల భూములు అంత సారవంతమైనవి కావు.

## సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

- నవంబరు 16 నుంచి మూడు విడతలుగా నిర్వహణ
- ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్న అధికారులు

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. వచ్చే నెల 16 తేదీ నుంచి మూడు విడతలుగా జరిగే ఎన్నికల షెడ్యూలు బుధవారం విడుదల కావడంతో జలవనరులు, రెవెన్యూ శాఖల అధికారులు ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమయ్యారు. నవంబరు 16న ప్రాదేశిక నియోజకవర్గం (టీసీ), 19న డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ), 22న ప్రాజెక్టు కమిటీ (పీసీ)లకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రకటన విడుదలైన 40 రోజుల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు, ఆయకట్టు రైతుల జాబితా సేకరణ, ఇతర ప్రక్రియలపై కసరత్తు చేస్తున్నారు. ''ఆయకట్టుదారులందరూ ఓటర్లుగా గుర్తింపు పొందుతారు.. ఈ మేరకు ఈ నెల 24లోగా వివరాల జాబితాలను రెవెన్యూ అధికారులకు అందజేయాలని ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి ఆదేశించారు.

| నీటి వనరు | సంఘాలు |
|---|---|
| తెలుగు గంగ | 47 |
| ఎస్సార్బీసీ | 48 |
| కేసీ కాల్వ | 47 |
| చెరువుల పరిధిలో | 105 |

## సరస్వతీ నమస్తుభ్యం

- కొలనుభారతిలో అమ్మవారి నిజరూప దర్శనం
- ప్రత్యేక పూజలు.. అక్షరాభ్యాసాలతో సందడి



నిజస్వరూపంలో అమ్మవారు

కొత్తపల్లి, న్యూస్‌టుడే : దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా కొలనుభారతి క్షేత్రం భక్తులతో కళకళలాడింది. క్షేత్రంలో కొలువైన సరస్వతీదేవి అమ్మవారు నిజరూప అలంకరణలో దర్శనమిచ్చారు. దీంతో అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారికి చారుఘోషిణి నదీ జలాలతో జలాభిషేకం చేశారు. కుంకుమార్చన, పుష్పార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వందలాది మంది చిన్నారులకు తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించుకున్నారు. అమ్మవారిని నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే జయసూర్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంగమేశ్వరం, కొలనుభారతి, ప్రాతకోట ఆలయాలను శ్రీశైలం క్షేత్రం పరిధిలోకి చేర్చి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఆలయ అర్చకులు భక్తులకు అందుబాటులో ఉండటం లేదని తన దృష్టికి వచ్చిందని, పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు


## కాళరాత్రి దేవి.. శుభాలిచ్చే తల్లి

ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు సందడిగా జరుగుతున్నాయి. ఉత్సవాల ఏడో రోజైన బుధవారం భ్రమరాంబాదేవి భక్తులకు కాళరాత్రి అలంకారంలో దర్శనమిచ్చారు. చుడడానికి భయంకరంగా ఉన్నప్పటికీ కాళరాత్రి దేవి భక్తులకు ఎల్లప్పుడూ శుభాలను కలిగిస్తుందని ప్రతీతి. అక్కమహాదేవి అలంకార మండపంలో విశేష పుష్పాలంకరణలతో ముస్తాబు చేసిన గజ వాహనంపై స్వామిఅమ్మవార్లు శోభాయమానంగా కొలువుదీరారు. కళాకారులు వివిధ వేషధారణలతో భక్తులను ఆకట్టుకున్నారు.






గజ వాహనంపై కొలువుదీరిన స్వామి అమ్మవారు



ఆది పరాశక్తిగా కళాకారిణి ప్రదర్శన



– న్యూస్‌టుడే శ్రీశైలం ఆలయం

**శ్రీశైలంలో నేడు :** శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాల ఎనిమిదో రోజు గురువారం రాత్రి 7 గంటలకు భ్రమరాంబాదేవి భక్తులకు మహాగౌరి అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

## బెదురు లేని వెదురు దొంగలు



సైకిళ్లపై అప్పనపల్లె పరిధిలో వెదుర్ల అక్రమ రవాణా

రాత్రిపూట జరిగే తరలిచేస్తున్న పరిస్థితి

నల్లమల అటవీ ప్రాంతంలో వెదురు దొంగలకు బెదురు లేకుండాపోయింది. చెలిమ, రుద్రవరం రేంజ్ పరిధిని గతేడాది అక్టోబరులో నాగార్జున సాగర్ టైగర్ రిజర్వు ఫారెస్టులోకి చేర్చారు. పులులు తిరుగుతున్న ప్రాంతం కావడంతో ఎవరూ ప్రవేశించకూడదని వెదుర్ల సేకరణనూ అధికారికంగా ఆపేశారు. దీంతో అక్రమార్కులు గుట్టుగా తరలిస్తున్నారు. తాజాగా రుద్రవరం మండలం గోనపల్లె వద్ద గుర్రంపై వెదుర్లు తరలిస్తూ పట్టుబడ్డారు.

### ఒక్కో కర్ర రూ.80కి విక్రయం

గృహోపకరణాలు, బుట్టలు, విసనకర్రలు, గుడిసెల నిర్మాణం, విస్తర్ల అల్లిక, అరటితోటలకు, ఐస్‌పుల్లల తయారీకి వెదుర్లను వినియోగిస్తున్నారు. అక్రమంగా తరలించిన వాటిని నల్లమల సమీపంలోని గ్రామాల్లో నిల్వ ఉంచుతున్నారు. అక్కడి నుంచి జాతీయ రహదారి మీదుగా కర్ణాటక, తెలంగాణకు తరలిస్తున్నారు. అక్రమంగా అడవుల నుంచి తెచ్చిన వాటిని బయట కొంతమంది ఒక్రో కర్రను రూ.30లకు కొనుగోలు చేసి ఇతరులకు రూ.70 నుంచి రూ.80 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

### అక్ర'మార్గాలు'

- రుద్రవరం, చెలిమ రేంజ్‌లతో పాటు పెద్దకంబలూరు, అహోబిలం, వనిపెంట సెక్షన్‌లో సైకిళ్లపై 200 నుంచి 300 కిలోల వరకు తీసుకెళ్తున్నారు.
- వనిపెంట సెక్షన్‌తో పాటు బాచేపల్లె బీట్‌లలో గాడిదలపై తరలిస్తున్నారు.
- పెద్ద కంబలూరు పరిధి నుంచి గుర్రాల ద్వారా, అహోబిలం నుంచి సైకిళ్లు, ఆటోలు, చాగలమర్రి పరిధి నుంచి గాడిదల ద్వారా వెదుర్ల అక్రమ రవాణా చేస్తున్నారు.
- అహోబిలం-నరసాపురం-ఆళ్లగడ్డ, బాచేపల్లె- ఆర్. కృష్ణాపురం-ముత్యాలపాడు-చాగలమర్రి, పెద్ద కంబలూరు-మహదేవపురం- గాజులపల్లె-నంద్యాల మార్గాలు అక్రమ రవాణాకు రాచబాటగా మారాయి.

– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, రుద్రవరం

### చర్యలు తీసుకుంటాం - శ్రీపతి నాయుడు, రేంజర్, రుద్రవరం రేంజ్

మా రేంజ్ పరిధిలో వెదుర్ల అక్రమ రవాణాను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. ఎవరు సహకరించినా చూస్తూ ఉరుకోం. అక్రమ రవాణాపై ప్రత్యేకంగా నిఘా ఉంచాం. రిజర్వు ఫారెస్టుగా మారడంతో ఇతరులు అటవీ ప్రాంతంలోకి వెళ్లకుండా కఠినంగా వ్యవహరిస్తాం.

## మద్యం దుకాణాల టెండర్లకు 11 వరకు గడువు

- 9వ తేదీ వరకు 1,448 దరఖాస్తులు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు చివరి గడువును ఈనెల 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 1 నుంచి 9వ తేదీ వరకు 1,448 టెండర్లు దాఖలైనట్లు నంద్యాల ఆబ్కారీ శాఖ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. మొదట్లో ఈనెల 9వ తేదీ చివరి గడువు అని చెప్పడంతో బుధవారం భారీఎత్తున టెండర్లు వేశారు. 8వ తేదీ వరకు 967 దరఖాస్తులే వచ్చాయి. 9వ తేదీ ఒక్కరోజే 481 టెండర్లు దాఖలవ్వడం విశేషం. గడువు మరో రెండు రోజులు పొడిగించడంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఆబ్కారీ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈనెల 14న లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తామన్నారు. 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు.

| స్టేషను | దుకాణాలు | టెండర్లు |
|---|---|---|
| నంద్యాల | 24 | 520 |
| నందికొట్కూరు | 10 | 105 |
| ఆళ్లగడ్డ | 19 | 246 |
| బనగానపల్లి | 12 | 112 |
| డోన్ | 16 | 225 |
| కోవెలకుంట్ల | 11 | 96 |
| ఆత్మకూరు | 13 | 144 |

## రూ.2.70 కోట్లు కొట్టేసేందుకు పన్నాగం

అక్రమంగా పుర స్థలం రిజిస్ట్రేషన్ ● పరిహారం పొందడానికి పావులు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పట్టణంలో పుర స్థలానికి సంబంధించి రూ.2.70 కోట్ల పరిహారం పొందడానికి కొందరు వేసిన పన్నాగం పన్నారు. నందికొట్కూరు పట్టణ పరిధిలోని సర్వే నంబరు-322, 323, 869లలో 19.60 ఎకరాల స్థలం ఉంది.. సంబంధిత యజమాని వెంచర్ వేశారు. నిబంధనల ప్రకారం పురపాలక సంస్థకు 1.90 ఎకరాలిచ్చారు. వెంచర్ మీదుగా 340సి జాతీయ రహదారి వెళ్తోంది. 80 పాట్లు, పురపాలకకు ఇచ్చిన 90 సెంట్లు జాతీయ రహదారిలో పోయాయి. పురపాలకకు కేటాయించిన స్థలాన్ని కొందరు గుట్టుగా రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు. పరిహారం పొందడానికి దరఖాస్తు చేసుకొన్నారు. సదరు వెంచర్‌కు పరిహారం చెల్లించే విషయంలో మొదటి నుంచీ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు.

### సెంటుకు రూ.3 లక్షలు

కర్నూలు-గుంటూరు రహదారిని విస్తరిస్తున్నారు. కర్నూలు నుంచి ఆత్మకూరు వరకు నాలుగు వరుసలుగా పనులు చేపడుతున్నారు. భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం ఇస్తున్నారు. సెంటు స్థలానికి రూ.3 లక్షలు చెల్లించారు. దీని ప్రకారం 90 సెంట్లకు రూ.2.70 కోట్ల పరిహారం వచ్చే అవకాశం ఉంది. దీన్ని దక్కించుకోవడానికి కొందరు వైకాపా నేతలు పావులు కదుపుతున్నారు. ఈ అంశంపై పట్టణ ప్రణాళికాధికారి బాలమద్దయ్యతో మాట్లాడగా పురపాలకకు కేటాయించిన స్థలాన్ని కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిసింది.. విచారణ చేస్తామన్నారు.



నందికొట్కూరులో వెంచరులో వేసిన 340సి జాతీయ రహదారి

## కస్తూర్బాలో కొలువు.. మహిళలకు పిలుపు

- దరఖాస్తుకు నేడు ఆఖరి రోజు

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యా నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు బోధించడానికి సీఆర్టీలు, ఇంటర్‌కు పీజీటీలు, అదే విధంగా పార్ట్‌టైమ్ ఉపాధ్యాయినులు, బోధనేతర సిబ్బంది ఉంటారు. వీటిలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నట్లు అధికారంలోకి వచ్చిన తర్వాత మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. దీనికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టారు. ఒప్పంద, పొరుగు సేవల విధానంలో ఏడాది ప్రాతిపదికన ఖాళీల భర్తీ కోరుతూ ప్రకటన విడుదల చేశారు.

– న్యూస్‌టుడే, కర్నూలు విద్య



చదువుకుంటున్న విద్యార్థినులు

### వెబ్‌సైట్‌లో దరఖాస్తులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 54 కేజీబీవీల్లో ప్రిన్సిపల్స్, పీజీటీలు, సీఆర్టీలు, కంప్యూటర్, ఒకేషనల్, అకౌంటెంట్లు, వార్డెన్లు కలిపి మొత్తం 83 ఖాళీలు ప్రకటించారు. పోస్టునుబట్టి రూ.18 వేల నుంచి గరిష్ఠంగా రూ.34 వేలకు పైగా వేతనం ఇస్తారు. ఇందుకు అర్హత కలిగిన వారంతా తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. apkgbv.apcsff.in వెబ్‌సైట్‌లో ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. వెబ్‌సైట్‌లో విద్యార్హతలు, వయసు గడువు తదితర వివరాలు ఉంటాయి.

### ఏ పోస్టులు ఎన్ని ఖాళీలు

- నంద్యాల జిల్లాలో బోధన ఉపాధ్యాయులకు సంబంధించి పీఈటీ 1, సీఆర్టీ గణితం 1, సీఆర్టీ భౌతిక శాస్త్రం 2, పీజీటీ వృక్ష శాస్త్రం 1, పార్ట్ టైమ్ టీచర్ 19, బోధనేతర విషయంలో అకౌంటెంట్లు 2, వార్డెన్లు 5 పోస్టులు భర్తీ చేయనున్నారు.
- కర్నూలు జిల్లాలో పీఈటీ 1, సీఆర్టీ తెలుగు 1, హిందీ 3, పీఎస్ 5, ఎన్ఎస్ 3, సోషియల్ 2, పీజీటీలో ఆంగ్లం 1, గణితం 1, భౌతికశాస్త్రం 1, రసాయనశాస్త్రం 1, వృక్షశాస్త్రం 2, ఎంపీహెచ్ డబ్ల్యూ 4, ఎంఎల్‌టీ 1, జీఎఫ్‌సీ 4, పార్ట్‌టైమ్ టీచర్ 16, బోధనేతర కింద వార్డెన్లు 6 పోస్టులు భర్తీ చేయనున్నారు.

## చెత్తదారి.. శుభ్రత మరిచిరి

నంద్యాల నుంచి మహానందికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే చెత్త కుప్పలు భారీ ఎత్తున పేరుకుపోయాయి. నంద్యాల పట్టణంలోని చెత్తాచెదారం, నిర్మాణ వ్యర్థాలను వాహనాల్లో తీసుకెళ్లి రోడ్డు పక్కన పడేస్తున్నారు. దీంతో ఆ దారి డంపింగ్‌యార్డును తలపిస్తోంది. తరచూ చెత్తకు నిప్పు పెడుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి నిత్యం వేలాదిమంది భక్తులు, పర్యాటకులు ఇదే మార్గంలో మహానందికి రాకపోకలు సాగిస్తున్నారు. రోజురోజుకు చెత్త నిల్వలు పెరుగుతూ రోడ్డుపైకి విస్తరిస్తున్నాయి. పురపాలక అధికారులు స్పందించి రోడ్డు పక్కన చెత్త కుప్పల్ని తొలగించి శుభ్రం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం



# పథకం.. ఫలప్రదం

- పండ్లు, పూల తోటల పెంపకానికి చేయూత
- ఉద్యాన సాగు విస్తీర్ణం పెంచేలా ప్రభుత్వం చర్యలు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఉద్యాన పంటల సాగుకు కూటమి ప్రభుత్వం చేయూతనిస్తోంది. సాగు పెంచేలా చర్యలు తీసుకుంటోంది. గత వైకాపా ప్రభుత్వం ఉద్యాన పంటలను నిర్లక్ష్యం చేసింది. రాయితీ బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం బకాయిలు చెల్లించడంతోపాటు కొత్తగా తోటల పెంపకం, పంట నిల్వ సౌకర్యాలు, ఫారం పాండ్స్ తదితరాలన్నీ పునరుద్ధరించాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా 2024-25 కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది.



మామిడి సాగు

### 17 రకాలకు సాయం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో చాలామంది రైతులు మామిడి, జామ, సపోటా, కొబ్బరి, స్వీట్ ఆరెంజ్, నేరేడు, దానిమ్మ వంటి ఉద్యాన పంటలనే ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎక్కువ ఆదాయం తెచ్చిపెట్టే పంటలున్నా పెట్టుబడి పెట్టేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అలాంటి వారికి ఉపాధిహామీ పథకం ద్వారా రాయితీ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాదాపు 17 రకాల పంటలకు మూడేళ్ల పాటు పెట్టుబడి సాయం అందించనుంది. అయిదెకరాల కంటే తక్కువ భూమి ఉన్న ఉద్యాన రైతులకు పెట్టుబడి సాయం అందుతుంది. జాబ్ కార్డు కలిగి ఉండాలి. భూమి చదును చేయడం నుంచి మొక్కలు నాటేందుకు గోతులు తీయడం, నీరు పోయడం, ఎరువులు తదితర సంరక్షణ చర్యలకుగాను రైతు ఖాతాకు నేరుగా సొమ్ము జమ చేస్తారు. ఈ నేపథ్యంలో వివిధ ఉద్యాన పంటల సాగుకు ఎక్కువమంది రైతులు మొగ్గు చూపుతున్నారు.

### గత ప్రభుత్వం నిర్లక్ష్యం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాయితీ నిధులు విడుదల కాలేదు. ఫలితంగా కొత్తగా పండ్ల తోటల సాగుకు రైతులు ఆసక్తి చూపలేదు. 2023-2024లో కర్నూలు జిల్లాలో 4,700 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేసేలా లక్ష్యం విధించినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. రైతులు ముందుగా వంద శాతం పెట్టుబడి పెట్టి పండ్ల తోటలు సాగు చేస్తారు. అందుకు అవసరమైన శాశ్వత పందిళ్లు, ఫారం పాండ్స్, ప్యాక్‌హౌస్‌లు వంటివి నిర్మిస్తారు. రాయితీ కోసం దరఖాస్తు చేశాక ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించి మార్గదర్శకాల ప్రకారం ఎంత రాయితీ వర్తిస్తుందో అంత చెల్లిస్తారు. వైకాపా పాలకులు మాత్రం ఏ సంవత్సరంలోనూ పూర్తిస్థాయిలో రాయితీలు చెల్లించలేదని రైతులు పేర్కొంటున్నారు. అడపాదడపా వచ్చిన నిధులను సైతం ప్రజాప్రతినిధుల సిఫార్సులతో తమ అనుయాయులకే ఇచ్చుకున్నారు.

### నమోదు పూర్తి

ఈ ఏడాది కర్నూలు జిల్లా పరిధిలో 5 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే అర్హులైన రైతులను గుర్తించి నమోదు ప్రక్రియ పూర్తి చేశారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 3,200 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు.

**వివిధ పంటలకు మూడేళ్లలో అందించే సాయం వివరాలు (రూ.లలో)**

| రకం | మొక్కలు (ఎకరా) | సాయం |
|---|---|---|
| మామిడి | 70 | 1,09,950 |
| స్వీట్ ఆరెంజ్ | 100 | 1,37,750 |
| చీనీ | 110 | 1,46,311 |
| జామ | 110 | 1,46,971 |
| తైవాన్ జామ | 444 | 2,51,224 |
| సపోటా | 60 | 95,584 |
| కొబ్బరి | 60 | 99,183 |
| నేరేడు | 40 | 68,163 |
| చింత | 40 | 68,403 |
| సీతాఫలం | 240 | 2,14,178 |
| దానిమ్మ | 267 | 2,16,417 |
| అంజూర | 310 | 1,67,324 |
| డ్రాగన్ ఫ్రూట్ | 225 | 2,00714 |
| ఆపిల్ బేర్ | 320 | 1,26,186 |
| రోజా తోట | 500 | 62,355 |
| మల్లె | 400 | 55,124 |
| మునగ | 112 | 27,515 |

## తెలంగాణ డీఎస్సీలో ఆత్మకూరు విద్యార్థినుల ప్రతిభ

ఆత్మకూరు, న్యూస్‌టుడే : తెలంగాణ డీఎస్సీలో ఆత్మకూరు విద్యార్థినులు ప్రతిభ చూపి ఓపెన్ కేటగిరిలో ర్యాంకులు సాధించినట్లు స్నేహ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఆశ బుధవారం తెలిపారు. కురుకుంద గ్రామానికి చెందిన ఎస్.హెచ్.గౌసియా తెలుగు ఎస్జీటీ విభాగంలో హైదరాబాద్ జిల్లాలో 3వ ర్యాంకు, ఇదే గ్రామానికి చెందిన బషీరున్ నిజామాబాద్ జిల్లా ఉర్దూ ఎస్జీటీ విభాగంలో 1వ ర్యాంకు సాధించారన్నారు. ఆత్మకూరుకు చెందిన మైమూన్ జగిత్యాల జిల్లా ఉర్దూ ఎస్జీటీ విభాగంలో 3వ ర్యాంకు తెచ్చుకున్నట్లు వివరించారు. ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు బుధవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన విజయోత్సవ సభలో తెలంగాణ ముఖ్యమంత్రి చేతులమీదుగా నియామక పత్రాలు అందుకున్నట్లు వెల్లడించారు.



ఎస్.హెచ్.గౌసియా



బషీరున్



మైమూన్

## ఇంత నిర్లక్ష్యమా...
# ఇటు కేసీ చూడండి

ఆళ్లగడ్డలోని కేసీ కెనాల్ చివరి ఆయకట్టు వద్ద గేట్లు తుప్పుపట్టి పాడయ్యాయి. కెనాల్ నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో నీటి ప్రవాహానికి వ్యర్థాలు అడ్డుగా ఉంటున్నాయి. కెనాల్ చుట్టూ మొక్కలు పెరిగినా తొలగించలేదు. ఏళ్లుగా గేట్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో లాకుల వద్ద తుప్పు ఎక్కువకావడంతో చాలాచోట్ల రంధ్రాలు పడ్డాయి. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టుకు నీటిని అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

–ఈనాడు, కర్నూలు



కేసీ కాలువ గేట్లకు తుప్పు పట్టిన పరిస్థితి



కేసీ కాలువ గేట్లకు తుప్పు పట్టిన పరిస్థితి



నీటి ప్రవాహానికి అడ్డుగా వ్యర్థాలు


## ఆసనాల విన్యాసం..
# పతకాల కైవసం

- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక
- ఆస్పరి కస్తూర్బా బాలికల ప్రతిభ



ధ్యానంలో కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు

ఆస్పరి, న్యూస్‌టుడే: ఆసనాలు నిత్యం సాధన చేస్తారు.. ఆరోగ్యంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది. బాలికలు యోగా సాధనలో ఆసక్తి కనబరుస్తున్నారు. పాఠశాలల్లో విద్యతో పాటు ఆరోగ్య పరిక్షణ, శారీరక దృఢత్వం, మానసికోల్లాసానికి రోజూ యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలో విజయాలు సాధిస్తున్నారు. ఆస్పరి కస్తూర్బా పాఠశాలలో ఆరు నుంచి ఇంటర్ వరకు సుమారు 270మంది విద్యార్థినులు చదువుతున్నారు. వీరికి విద్యతో పాటు క్రీడలు, వ్యాయామం, యోగా, ధ్యానంపై కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పాఠశాల ప్రత్యేక అధికారిణి షారోన్ స్మైలీ, వ్యాయామ ఉపాధ్యాయిని రాజేశ్వరి ప్రత్యేక శిక్షణపై దృష్టిసారిస్తున్నారు. కస్తూర్బా విద్యార్థులు ప్రత్యేకంగా నిలుస్తున్నారు.



వృశ్చికాసనంలో..

### ఇలా ఆచరిస్తారు..

ప్రతి రోజు తెల్లవారుజామున 4.30గంటలకే నిద్ర లేస్తారు. అర గంట పాటు చదువుతారు. 5.15 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక యోగా శిక్షణ, 6 నుంచి 6.30వరకు ధ్యానం నేర్పిస్తారు. నాలుగేళ్లుగా బాలికలను సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేక దినోత్సవాల్లో ఆసనాలు ప్రదర్శిస్తుంటారు. పోటీలు ఎక్కడ జరిగినా పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నారు.

### పల్లవించిన విజయాలు



ఆస్పరి మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన పరమేష్, పద్మవతి దంపతుల కుమార్తె పల్లవి. కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు వ్యవసా కూలీలు. 2021, 2022లో జరిగిన యోగాసనాల్లో పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. 2023లో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి.. కోల్‌కతాలో జరిగిన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అక్కడ రన్నర్‌గా నిలిచింది. పట్టు వదలకుండా సాధన చేసి 2024లో జిల్లా స్థాయిలో గెలిచి ఇటీవల విశాఖపట్నంలో భీమిలిలో రాష్ట్ర స్థాయిపోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయిలో తప్పక విజయంసాధిస్తానని చెబుతోంది పల్లవి. ఇంటర్ ప్రథమ సంవత్సరంలోనూ ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఉపాధ్యాయినులు తెలిపారు.

### క్రమశిక్షణ, ఆరోగ్య రక్షణ



**- రాజేశ్వరి, వ్యాయమ ఉపాధ్యాయిని, కస్తూర్బా పాఠశాల**

విద్యార్థినులకు యోగాతో మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆరోగ్యం దరిచేరుతాయి. యోగా, ధ్యానంతోనే రోగాలు దరిచేరవు. ఆసనాలతో మనస్సు, శరీరం మన ఆధీనంలో ఉంటాయి. విద్యార్థులు ఆసక్తిగా సాధన చేస్తూ.. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారు. ఈ ఏడాది మొత్తం ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించారు. పల్లవి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా మిగిలిన నలుగురు ఉషారాణి, భూమిక, శ్యామల, శ్రుతి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రన్నర్స్‌గా నిలిచారు.

### విద్యతో పాటు వ్యాయామం



**- షారోన్ స్మైలీ, పాఠశాల ప్రత్యేక అధికారిణి**

కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు విద్యతో పాటు వ్యాయమంలో భాగంగానే ఆటలు, యోగా, ధ్యానం నేర్పుతున్నాం. ఉపాధ్యాయులు చెప్పేపాఠాలు వెంటనే గ్రహించే శక్తి యోగాతో వస్తుంది. చదువులో ఉత్తమ ఫలితాలతో పాటు ఆటల్లో పతకాలు సాధిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం చాలా సంతోషంగా ఉంది. అందరినీ ప్రోత్సహిస్తున్నాం.

## ఆర్థిక ప్రయోజనాలు కల్పించకుంటే ఉద్యమిస్తాం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు, పింఛనర్లకు ఆర్థిక ప్రయోజనాలు ప్రకటించకుంటే దసరా తర్వాత ఉద్యమిస్తామని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌలాలి, అజాంబేగ్ హెచ్చరించారు. నంద్యాల పట్టణంలోని జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో బుధవారం సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర మాజీ అదనపు ప్రధాన కార్యదర్శి జీవీ శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వాలు దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో సంఘం మండల బాధ్యుడు నాగేశ్వరనాయక్, నాయకులు గోపాలకృష్ణ, దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి

## సాగుదారుల పేరుతోనే పంట నమోదు

నంద్యాల గ్రామీణం, మహానంది, న్యూస్‌టుడే : వాస్తవ సాగుదారుల పేరుతోనే పంట నమోదు చేయాలని కలెక్టర్ జి.రాజకుమారి స్పష్టం చేశారు. పంటలు సాగుచేసిన రైతుల ఈకేవైసీ వందశాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నంద్యాల మండలం కానాల, మహానంది మండలంలోని బుక్కాపురం, అల్లినగరం గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. వ్యవసాయ సిబ్బంది చేపట్టిన ఈ-పంట నమోదును సూపర్ చెక్ చేశారు. ఇందులో భాగంగా పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పంట నమోదులో ఎలాంటి పొరపాట్లు ఉండరాదన్నారు. వివరాలన్నీ సరిగ్గా ఉంటేనే ప్రభుత్వం నుంచి పంటకు మద్దతు ధర, బీమా, నష్ట పరిహారం ఇతర ప్రయోజనాలు నిజమైన రైతుకు దక్కుతాయన్నారు. దూరంగా ఉన్న అరటి తోటల నుంచి వాహనాల వద్దకు గెలలను తరలించేందుకు ఒక్కో గెలకు రూ.30 ఖర్చవుతోందని బుక్కాపురం రైతులు కలెక్టర్‌కు వివరించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రాజశేఖర్, నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు, మహానంది మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి, ఉద్యానశాఖ అధికారి శ్రీధర్ తదితరులు ఉన్నారు.



బుక్కాపురం అరటి తోటలో పంట నమోదు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజకుమారి

## అమ్మవారిని కొలవగా..
# ఆనందం నిండుగా

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శరన్నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి, అమృతవల్లి అమ్మవారు నిత్యం విశేష పూజలందుకుంటున్నారు. బుధవారం నవరాత్రి ఉత్సవంలో భాగంగా స్వామి, అమ్మవారిని అభిషేకించి మహా మంగళహారతి అందించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. రాత్రి వేదప్రబంధ పారాయణాలు పఠించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజలు చేశారు.



స్వామి, అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చకులు

## దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి ఫరూక్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ బుధవారం దుర్గమ్మ విగ్రహాన్ని దర్శించుకున్నారు. శరన్నవ రాత్రి వేడుకల్లో భాగంగా నంద్యాల పట్టణం ఉప్పరిపేటలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి ఆయన పూజలు చేశారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామచంద్రరావు, నాయకులు ఎన్ఎండీ ఫయాజ్, ఎనిమిదో వార్డు ఇన్‌ఛార్జి ఉప్పరి సురేశ్, ఉప్పరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మంత్రి ఫరూక్

## టెట్‌కు 64 మంది గైర్హాజరు

నంద్యాల గ్రామీణం, పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలో బుధవారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 64 మంది గైర్హాజరైనట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. నంద్యాల మండలంలోని అయ్యలూరిమెట్ట వద్ద ఉన్న ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 175 మందికి గాను 26, సాయంత్రం 176 మందికి గాను 16 మంది గైర్హాజరయ్యారన్నారు. పాణ్యం మండలంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం వందమంది అభ్యర్థులకు 87, మధ్యాహ్నం వందమందికి 91 మంది హాజరైనట్లు ఎంఈవో2 సుబ్రహ్మణ్యం తెలిపారు.

## 882.10 అడుగులకు చేరిన శ్రీశైలం నీటిమట్టం

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం నీటిమట్టం బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 882.10 అడుగులు, నీటి నిల్వ 199.7353 టీఎంసీలుగా నమోదైంది. ఎగువ పరీవాహక ప్రాంతాలైనా జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 34,048 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాలల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 65,942 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

## ముగ్గురి బలవన్మరణం

జిల్లెల్లా(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: ఉరివేసుకుని వివాహిత శకుంతల(36) ఆత్మహత్యకు పాల్పడినట్లు నందివర్గం పోలీసులు తెలిపారు. జమ్మలమడుగుకు చెందిన శకుంతలను బనగానపల్లి మండలం జిల్లెల్లాకు చెందిన బలరాముడికి 17 సంవత్సరాల కిందట ఇచ్చి వివాహం చేశారు. శారీరకంగా, మానసికంగా భర్త వేధిస్తుండటంతో మంగళవారం రాత్రి ఆమె ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు నందివర్గం పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సంతానం కలగడం లేదని ..

మైలవరం, న్యూస్‌టుడే : సంతానం కలగడం లేదని మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. నంద్యాల జిల్లా అవుకు మండలం రామాపురానికి చెందిన దూదేకుల షమీనా (23)కు మైలవరం మండలం నార్జంపల్లెకు చెందిన సభహాన్‌తో నాలుగేళ్ల కిందట వివాహమైంది. షమీనా జమ్మలమడగులోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. తమకు సంతానం కలగడం లేదని కొన్ని రోజులుగా షమీనా బాధపడుతుండేవారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ప్రేమికుడు మాట్లాడటం లేదని బీటెక్ విద్యార్థిని

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : రెండేళ్లుగా ప్రేమిస్తున్న యువకుడు మాట్లాడేందుకు నిరాకరించాడన్న మనస్తాపంతో బీటెక్ విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నంద్యాల పట్టణంలోని పొన్నాపురంలో చోటుచేసుకుంది. గ్రామీణ సీఐ అస్రార్ బాషా తెలిపిన వివరాల మేరకు.. పొన్నాపురానికి చెందిన వెంకటేశ్వర్లు, కాంతాలు దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. వెంకటేశ్వర్లు ఆటో నడుపుతూ పిల్లలను చదివిస్తున్నారు. పెద్ద కూతురు శశికళ (20) తిరుపతిలోని పద్మావతి విశ్వవిద్యాలయంలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నారు. రెండేళ్ల నుంచి ఈమె నంద్యాలకు చెందిన ప్రసాద్‌ను ప్రేమిస్తున్నారు. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వచ్చిన శశికళ ప్రసాద్‌తో మాట్లాడేందుకు పలుమార్లు ప్రయత్నించారు. ఇందుకు అతడు నిరాకరించడంతో మనస్తాపం చెందిన యువతి ఈనెల 6న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు సీఐ వివరించారు. మృతురాలి తల్లి కాంతాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నజీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## వాహనం ఢీకొని వ్యక్తి మృతి

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: డోన్ జాతీయ రహదారిలోని యు.కొత్తపల్లి సమీపంలో ఆటోను, గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. అనంతపురం జిల్లా పెద్దవడుగూరుకు చెందిన ఓబులపతి ఆటోలో నిమ్మకాయలు లోడ్ చేసుకుని కర్నూలు వైపు వెళ్తుండగా, బుధవారం తెల్లవారుజామున డోన్ సమీపంలోని యు.కొత్తపల్లి వద్ద ఆటో పంక్చర్ అయ్యింది. ఆటోను ఆపి చూస్తుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీ కొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఓబులపతి అక్కడికక్కడే ప్రాణాలొదిలారని సీఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## పోక్సో కేసు నమోదు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: యు.కొత్తపల్లికి చెందిన ఆర్మీ ఉద్యోగిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ ఇంతియాజ్ తెలిపారు. యు.కొత్తపల్లికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన సుధీర్‌బాబు ప్రేమించి.. పెళ్లి చేసుకుంటానని చెప్పి, నమ్మించి మోసం చేశాడని పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

## బాలలతో పనిచేయిస్తే చర్యలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : దుకాణాల్లో బాల కార్మికులతో పనిచేయిస్తే చర్యలు తప్పవని నందికొట్కూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఇందిరాప్రియదర్శిని హెచ్చరించారు. స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆపరేషన్ స్వేచ్ఛ- బాండెడ్ ఛైల్డ్ లేబర్ కార్యక్రమం నిర్వహించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణ, లేబర్ అధికారి షమీర్‌బాషా, పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఇందిరాప్రియదర్శిని, తదితరులు

## పత్తిలో పంట కోత ప్రయోగం

గడివేముల, న్యూస్‌టుడే : మండలంలోని చెన్నకపల్లె గ్రామంలో బుధవారం పత్తిలో పంట కోత ప్రయోగం చేసినట్లు వ్యవసాయాధికారి హేమసుందరరెడ్డి తెలిపారు. వంద చదరపు మీటర్ల పరిధిలో పత్తి తీసి తూకం వేయగా 8.100 కిలోల దిగుబడి వచ్చిందని వెల్లడించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రామకృష్ణ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM) నందికొట్కూరు : 94403 61729 ఆత్మకూరు : 90149 09024 నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం : **సమస్య :** నూనెపల్లె పరిధిలోని సత్యనారాయణ స్టోర్ వద్ద ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. **- ఫక్కీరయ్య, స్థానికుడు**

**సమస్య :** పట్టణంలోని సాయిబాబానగర్ ప్రాంతంలో కాల్వలు సరిగా శుభ్రం చేయడం లేదు.

**- ఈశ్వర్, స్థానికుడు**

**సమాధానం :** సిబ్బందికి సూచించి రోజూ చెత్త తీసుకెళ్లేలా చూస్తాం. కాల్వలు శుభ్రం చేయిస్తాం.

**- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

## వసతిగృహాల మరమ్మతులకు ప్రతిపాదనలు ఇవ్వండి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : వసతిగృహాల మరమ్మతులకు అంచనాలు తయారుచేసి ప్రతిపాదనలు ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. నంద్యాల పట్టణం బొమ్మలసత్రంలోని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలను బుధవారం రాత్రి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల గదులు, స్టోర్‌రూం, వంటగదులు, డైనింగ్ హాళ్లు, మరుగుదొడ్లను పరిశీలించి శుభ్రంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మరుగుదొడ్లు, విద్యుత్తు పరికరాల మరమ్మతులు, డ్రైనేజీ, రహదారులు, మంచినీటి సౌకర్యం కల్పించేందుకు వెంటనే అంచనాలు తయారు చేయాలని చెప్పారు. పనికిరాని వస్తువులను వేలం వేయాలన్నారు. మూడు రోజుల తర్వాత మళ్లీ తాను వసతిగృహాలను పరిశీలిస్తానని చెప్పారు. అప్పట్లోగా హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, గిరిజన సంక్షేమ అధికారి శివప్రసాద్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఎస్టీ వసతిగృహాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

# రూ.కోట్లు కరిగినా.. చెత్త తరగదు

**ఎకరం ఖాళీ చేస్తే ఒట్టు**

☛ నీరుగారిన వ్యర్థాల శుద్ధి ప్రక్రియ

☛ డంపింగ్‌యార్డులో చోటు లేక సమస్యలు

నంద్యాల పురపాలకం, రైతు నగరం, న్యూస్‌టుడే : నంద్యాల పురపాలక సంఘం పరిధిలోని డంపింగ్ యార్డులో చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. పట్టణంలో రోజువారీ సేకరిస్తున్న వ్యర్థాలను వేసేందుకు ప్రస్తుతం చోటు కరవైంది. దీంతో గత వైకాపా ప్రభుత్వంలో చెత్త శుద్ధీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. మూడు నెలల్లో వ్యర్థాలను పూర్తిగా శుద్ధి చేయిస్తాం. డంపింగ్ యార్డులోని 14 ఎకరాల స్థలాన్ని ఖాళీ చేయిస్తామని అప్పటి ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పారు. ఆచరణలో మాత్రం విఫలమయ్యారు. దీంతో గుట్టలుగా పోగైన వ్యర్థాల వల్ల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వాయు కాలుష్యం, దుర్గంధంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు.

పట్టణంలోని భీమవరం రహదారిలో ఉన్న పురపాలక డంపింగ్‌యార్డులో దాదాపు 90 వేల మెట్రిక్ టన్నుల చెత్త పోగైనట్లు అధికారులు చెబుతున్నారు. దీన్ని శుద్ధి చేసి 14 ఎకరాల స్థలాన్ని ఖాళీ చేయించేందుకు 2022 డిసెంబరులో గుత్తేదారుతో రూ.5.25 కోట్లకు ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా గుత్తేదారు 66 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు శుద్ధి చేయాల్సి ఉంది. కొన్ని రోజులు యంత్రాలతో చెత్త శుద్ధీకరణ చేపట్టారు. తర్వాత యంత్రం పనిచేయ లేదని చేతులెత్తేశారు. 55 వేల టన్నుల చెత్తను శుద్ధి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. 32 వేల టన్నుల శుద్ధి చేసిన వ్యర్థాలను బయటికి పంపించామంటున్నారు. గుత్తేదారుకు దాదాపు రూ.1.90 కోట్ల బిల్లులు చేసేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. డంపింగ్ యార్డులో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఎటుచూసినా చెత్త గుట్టలు పేరుకుపోయింది. గతానికి ఇప్పటికీ ఎలాంటి మార్పు లేదని ప్రజలు చెబుతున్నారు. ఎకరం స్థలం కూడా ఖాళీ కాకపోవడం చెత్తశుద్ధిలోని చిత్తశుద్ధిని వెల్లడిస్తోంది.

**పాగతో ప్రజలకు అనారోగ్యాలు**

ప్రస్తుతం పట్టణం నుంచి తీసుకొచ్చే చెత్తను వేసేందుకు డంపింగ్‌యార్డులో స్థలం లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా ఈ సమస్య పరిష్కరించేలా మంత్రి ఫరూక్ చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చెత్త కుప్పలకు తరచూ నిప్పు పెడుతుండటంతో సమీప ప్రాంతాలైన పీవీ నగర్, హరిజనవాడ, చింత అరుగు ప్రాంతాలను పొగ, ధూళి కమ్మేస్తోంది. ఊపిరి తీసుకోవాలన్నా కష్టంగా ఉంటోందని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు మంటలు భారీగా విస్తరించి పట్టణంలోని వన్‌టౌన్ ప్రాంతమంతా పొగ వ్యాపిస్తోంది. ఈ అంశాన్ని గతంలో చాలాసార్లు తెదేపా కౌన్సిలర్లు కౌన్సిల్‌లో లేవనెత్తారు. అయినాసరే అధికారులు పట్టించుకోలేదు.



డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్త



## కాల్వ ఇలా.. మురుగు పారేదెలా

జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలో మురుగు కాల్వల నిర్వహణ అధ్వానంగా మారింది. పలు ప్రాంతాల్లో కాల్వలను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో ఎక్కడికక్కడ పూడిక పేరుకుపోయింది.. పద్మావతినగర్‌లో నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో పూడిక చేరి పెద్ద ఎత్తున గడ్డి పెరిగింది. దీంతో దుర్వాసన, దోమల సమస్య తీవ్రమయ్యాయని కాలనీవాసులు వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

## మహానందీశునికి డీఎఫ్‌వో పూజలు

మహానంది, న్యూస్‌టుడే : నంద్యాల అటవీశాఖ డీఎఫ్‌వో నాగమునీశ్వరి బుధవారం మహానంది క్షేత్రాన్ని సందర్శించారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం వేదపండితులు యాగాలలో ఆమెను ఆశీర్వదించారు. ఏఈవో ప్రదీప్‌కుమార్, ఎస్ఎస్‌వో విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆశీర్వాదం పొందుతున్న డీఎఫ్‌వో నాగమునీశ్వరి

## క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : క్రీడల్లో రాణిస్తే ఆటగాళ్లకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డా.రామకృష్ణారెడ్డి, గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత డా.దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. నంద్యాలలో నిర్వహించిన జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు బుధవారం రాత్రి గురురాజ పాఠశాల మైదానంలో క్యాంప్ ఫైర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. క్రీడాకారులు నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, గురురాజ పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న క్రీడాకారులు

## ఉపాధిహామీ పనులను గుర్తించండి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామస్థుల భాగస్వామ్యంతో ఉపాధిహామీ పనుల గుర్తింపును వేగవంతం చేయాలని డ్వామా పీడీ జనార్దనరావు సిబ్బందికి సూచించారు. పాణ్యం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఈనెల 14 నుంచి నిర్వహించనున్న పల్లె పండుగ కార్యక్రమంలో సిటిజన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో విజయరాణి, ఈసీ శివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ జనార్దనరావు

## యాప్‌ల భారం తగ్గించాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ సిబ్బందిపై యాప్‌ల భారం తగ్గించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంఘం కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌ను రూపొందించాలని కోరారు. ఈమేరకు అంగన్‌వాడీ సిబ్బంది ఆత్మకూరులోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. కేంద్రాల విద్యుత్తు బిల్లులు చెల్లించాలని కోరారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

## ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మగ్గం, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ సంచాలకుడు కె.పుష్పక్ బుధవారం తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయసున్న గ్రామీణ ప్రాంత మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఉచిత శిక్షణతో పాటు భోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.

## పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని 12వ వార్డు సచివాలయ పారిశుద్ధ్య సిబ్బందికి తెదేపా నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్ కండె శ్యాంసుందర్‌లాల్ సొంతఖర్చుతో దుస్తులు అందజేశారు. దసరా సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడంపై హర్షణీయమని ఫయాజ్ పేర్కొన్నారు.

## దళితులకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కొత్తరామాపురం గ్రామంలో దళితులకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏసురత్నం, మండల కార్యదర్శి నరసింహానాయక్ డిమాండ్ చేశారు. కొత్త రామాపురంలో బుధవారం వారు సీపీఎం కార్యవర్గ సభ్యులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



మహానంది : కాళరాత్రి దుర్గ అలంకారంలో కామేశ్వరీదేవి



నంద్యాల గాంధీచౌక్ : సరస్వతీదేవిగా నిమిషాంబదేవి



నంద్యాల గాంధీచౌక్ : మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో



నంద్యాల గాంధీచౌక్ : గాయత్రీదేవి ఆలయంలో..



శ్రీశైలం : సరస్వతీదేవి అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి

# వీణాపాణి.. జ్ఞాన ప్రదాయిని

దసరా మహోత్సవాలు ఊరూరా ఘనంగా కొనసాగుతున్నాయి. నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం నియోజకవర్గాల పరిధిలోని పలు ఆలయాల్లో అమ్మవారికి రోజుకో అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఏడోరోజైన బుధవారం పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతీమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొలనుభారతి క్షేత్రంలో మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతి అమ్మవారు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించుకున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల కల్చరల్ బృందం



కొత్తపల్లి : కొలనుభారతి క్షేత్రంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జయసూర్య



నంద్యాల గాంధీచౌక్ : కోట సుంకులమ్మ ఆలయం వద్ద కుంకుమార్చన చేస్తున్న మహిళలు




ఆత్మకూరు : సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన మల్లెలమ్మ



నందికొట్కూరు : చౌడేశ్వరీ దేవి ఆలయంలో సరస్వతీ దేవి అలంకరణ



నందికొట్కూరు : సరస్వతి రూపంలో కన్యకాపరమేశ్వరీదేవి



పాణ్యం గ్రామీణం : పాణ్యంలో పూజలు అందుకుంటున్న అమ్మవారు

## సమగ్ర సస్యరక్షణ చర్యలతో ఎలుకల నివారణ



పాణ్యంలో ఎలుకల నివారణ పద్ధతులు వివరిస్తున్న వ్యవసాయాధికారి జయప్రకాశ్‌రెడ్డి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : పంటల్లో ఎలుకల నివారణకు వ్యవసాయ అధికారులు సూచించిన సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు సూచించారు. వెలుగోడు మండలంలోని రేగడగూడూరు గ్రామంలో ఏవో పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ పాల్గొన్నారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా రైతులకు ఎలుకల మందు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

నందిపల్లె (మహానంది), న్యూస్‌టుడే : వరి పంటలో సామూహిక ఎలుకల నివారణ చేపడితేనే అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి బి.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. మహానంది మండలం నందిపల్లె గ్రామంలో బుధవారం సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. విషపు ఎర తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరెడ్డి, వీఏలు లక్ష్మీకాంత్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : పొలాల్లో ఎలుకల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, మందుల తయారీపై పాణ్యంలోని మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలుకల నివారణ మందుల తయారీ విధానాన్ని మండల వ్యవసాయాధికారి జయప్రకాశ్‌రెడ్డి రైతులకు వివరించారు.

## గొర్రెల పెంపకందార్ల సంఘం డైరెక్టరుగా యుగంధర్

గడివేముల, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాల గొర్రెల పెంపకందార్ల సహకార సంఘం డైరెక్టర్‌గా బిలకలగూడూరు గ్రామానికి చెందిన యుగంధర్‌ను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల పెంపకందార్ల సంక్షేమం కోసం కృషిచేస్తానని తెలిపారు. డైరెక్టరుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



యుగంధర్

## వేగవంతంగా తపాలా సేవలు



రైల్వే స్టేషన్ వద్ద ప్రదర్శన చేస్తున్న తపాలా సిబ్బంది

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలా శాఖ ద్వారా ప్రజలకు వేగవంతమైన సేవలు అందిస్తున్నట్లు నంద్యాల పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. తపాలా శాఖ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నంద్యాల ఆర్ఎస్ తపాలా కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు ఫిట్ పోస్ట్- ఫిట్ ఇండియా నినాదంతో తపాలా ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు ఖాతాలు, మనీ ఆర్డర్లు, బీమా పాలసీలకు డిజిటల్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. నందవరం, పోలూరు, గాజులపల్లి, సున్నిపెంట ప్రాంతాల్లో గురువారం ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తపాలాశాఖ నిర్వహించిన లేఖా రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని తేజస్వినికి రూ.25 వేల నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. తపాలా సేవల ప్రాముఖ్యతపై నిర్వహించిన కవితా పోటీల్లో గెలుపొందిన అన్నెం శ్రీనివాసరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ పార్వతి, షంసున్నిసా, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## మహానంది సుందరీకరణకు ప్రణాళిక

మహానంది, న్యూస్‌టుడే : మహానంది క్షేత్రం సుందరీకరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. క్షేత్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. గతంలో రూపొందించిన బృహత్తర ప్రణాళిక ఆమోదం పొందలేదన్నారు. దీంతో నూతన ప్రణాళిక తయారు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు సంస్థ ప్రతినిధులు రెండు రోజులపాటు 52 ఎకరాల ప్రాంగణాన్ని పరిశీలించి ఎక్కడెక్కడ ఏయే పనులు చేపట్టాలో వివరాలు నమోదు చేశారన్నారు. వారు రూపొందించే ప్రణాళిక ఆధారంగా క్షేత్రాన్ని మరింత అందంగా తీర్చిదిద్దనున్నట్లు ఈవో వివరించారు.

## ఆకతాయికి 15 రోజుల జైలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఆకతాయికి నంద్యాల సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి 15 రోజుల జైలుశిక్ష విధించారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన గురుమహరాజ్ స్థానిక గిరినాథ్ సెంటర్‌లో దారిన వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి బుధవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ ఆకతాయికి 15 రోజుల జైలు శిక్ష విధించారు.

# ప్రమాదాల మలుపులు.. ప్రయాణికుల్లో గుబులు



నందికొట్కూరు మండలంలోని శాతనకోట వెళ్లే దారిలో

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే : నందికొట్కూరు నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామీణ రహదారుల్లో ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గాల్లో రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లోని పలు రహదారుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వర్షాకాలం కావడంతో ఆయా రోడ్లకు ఇరువైపులా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. వీటిని తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

☛ ఆత్మకూరు నుంచి సంగమేశ్వరం వెళ్లే మార్గంలో సుమారు 30 మలుపులు ఉన్నాయి. కొన్నిచోట్ల ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

☛ సింగరాజుల్లి గ్రామ ప్రారంభంలో, లింగాపురం ఊరి మధ్యలో, కొత్తపల్లి బస్టాండు సమీపంలో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి.

☛ పాములపాడు మండల కేంద్రం నుంచి వాడాల, మద్దూరు, లింగాల, చెలిమిల్ల గ్రామాలకు వెళ్లే దారుల్లోని మలుపుల వద్ద ముళ్లపొదలు రోడ్లను కప్పేశాయి.

☛ పగిడ్యాల మండలంలో లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం వెళ్లే దారుల్లో పలుచోట్ల సమస్యాత్మక మలుపులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు కూడా లేవు.

☛ భాస్కరాపురం, కనకయ్య కొట్టాలకు వెళ్లే దారిలో మలుపుల వద్ద కంపచెట్లు ఏపుగా పెరిగాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది.

☛ నందికొట్కూరు మండలం వడ్డెమాను, శాతనకోట గ్రామాలకు వెళ్లే రహదారుల్లో సైతం మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.



కొత్తపల్లి మండలం సింగరాజుపల్లి– శివపురం మార్గంలో..



శివపురం– ఎం.లింగాపురం మధ్యలో..

### భయం భయంగా వెళుతున్నాం..

**- ముర్తుజావలి, శివపురం, కొత్తపల్లి మండలం**

నేను కొత్తపల్లిలోని ఓ క్లినిక్‌లో పనిచేస్తున్నా. రోజూ మా ఊరి నుంచి 9 కి.మీ ప్రయాణించాల్సి ఉంది. దారి మధ్య ప్రమాదకర మలుపులు ఉన్నాయి. దగ్గరికి వెళ్లే వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది.

## మద్యం దుకాణాల టెండర్లకు గడువు పెంపు

మహానంది, న్యూస్‌టుడే : మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు నంద్యాల ఆబ్కారీ సీఐ కృష్ణమూర్తి తెలిపారు. మహానంది పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఎన్.రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహానంది మండలం పరిధిలో 3 దుకాణాలకు 28 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ మూడు దుకాణాలను మండలంలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. మరో రెండు రోజులు గడువు ఉన్నందున ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వెలుగోడు, న్యూస్‌టుడే : మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు మరో రెండు రోజులు గడువు పెంచినట్లు ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. వెలుగోడు పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో మూడు మద్యం దుకాణాలకు 12 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈనెల 11వ వరకు దరఖాస్తుకు గడువు ఉందని వివరించారు.

## ఏజీపీగా వెంకటేశ్వర్లు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా వేముల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. తనను ఏజీపీగా నియమిస్తూ ఈనెల 8న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రి ఫరూక్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.



అబ్దుల్ అలీమ్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

## పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యానికి రక్ష

ఆర్‌ఎస్ రంగాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం ఆర్‌ఎస్ రంగాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. వైద్యులు హాజరు పట్టీని పరిశీలించారు. సిబ్బంది పనితీరుపైనా ఆరా తీశారు. దోమలు వ్యాప్తి చెందకుండా దోమతెరలను ఉపయోగించేలా అవగాహన కల్పించాలన్నారు.


# ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్


## నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్లలోని ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య బుధవారం తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో డిపో పరిధిలో సమస్యలు, ఫిర్యాదులను 9959225798 నంబరుకు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574316
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లి: 80085 73763

డోన్‌పట్టణం: సమస్య: త్రివర్ణకాలనీలోని కళాశాల బాలికల వసతిగృహం వీధి కివారులో వీధిదీపం వెలగడం లేదు. -జయకృష్ణ, త్రివర్ణకాలనీ.

సమాధానం: వీధిదీపాన్ని ఏర్పాటు చేస్తాం. -సురేష్, మున్సిపల్ ఏఈ

సమస్య: సాయి ఫంక్షన్‌హాల్ పక్కనున్న వీధిలో చెట్టు కొమ్మ గాలికి విరిగి రహదారిపై పడింది. రాకపోకలకు అంతరాయంగా మారింది. -శ్రీనివాసులు, నెహ్రూనగర్.

సమాధానం: చర్యలు తీసుకుంటాం. -సునీల్‌బాబు, తాత్కాలిక శానిటరీ అధికారి.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: సమస్య: గోవిందపల్లె శివార్ల రహదారిపై చెత్తను వేస్తున్నారు. -నారాయణ

సమాధానం: కార్మికుల ద్వారా తొలగిస్తాం. -రాజకుమార్, సచివాలయ పంచాయతీ కార్యదర్శి.

సమస్య: రామునిమాన్యం కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. -భాస్కరయ్య

సమాధానం: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. -సాలమ్మ, సర్పంచి.

## అవీ.. ఇవీ.. అన్నీ..

బనగానపల్లి గ్రామీణం: పట్టణంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం బుధవారం సందడిగా కనిపించింది. మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఈనెల 11న సాయంత్రం వరకు స్వీకరించనున్నట్లు సీఐ వరప్రసాద్ తెలిపారు.

సంజామల: ఈ నెల 11 వరకు మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుకు ప్రభుత్వం గడువు పెంచిందని కోవెలకుంట్ల ఎక్సైజ్ సీఐ తబీ బాషా అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

బేతంచెర్ల: మద్యం షాపులకు ఈనెల 11 వరకు ప్రభుత్వం గడువు పెంచినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు.

జలదుర్గం(ప్యాపిలి), న్యూస్‌టుడే: జలదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు జలదుర్గం ఎస్సై బుధవారం తెలిపారు. హుస్సేనాపురం బస్టాండు, చంద్రపల్లె కూడలిలో కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

డోన్, ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరంసుబ్బారెడ్డి బుధవారం కలిశారు. శాలువా వేసి పుష్పగుచ్ఛం అందజేశారు. భార్గవరామ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాలను కూడా ధర్మవరం కలసి మాట్లాడారు.

రుద్రవరం: మద్యం దుకాణాల దరఖాస్తుకు గడువు రెండు రోజులు పొడిగించినట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి తెలిపారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని శిల్పా వెంచర్‌ను పరిశీలించేందుకు వచ్చిన జేసీ విష్ణు చరణ్‌ను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కలిశారు. బుధవారం ఆమె తహసీల్దారు కార్యాలయంలో జేసీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు,

బనగానపల్లి, న్యూస్‌టుడే: కొండపేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో పట్టణ మాజీ సర్పంచి బీసీ రాజారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోవెలకుంట్ల: నేడు జరగబోయే మంత్రివర్గ సమావేశంలో 12వ పీఆర్సీ ప్రకటించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీపికబురు అందించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్తు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.వీరబ్రహ్మం ప్రకటనలో కోరారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో నీటి ట్యాంకుల శుభ్రతను పాటించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ పేర్కొన్నారు.

బాచేపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం): ఎలుకల నిర్మూలనతోనే వరి పంట నష్టాన్ని అధిగమించవచ్చని వ్యవసాయాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బాచేపల్లె, నందిపల్లె గ్రామాల్లో బుధవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు.

యల్లావత్తుల(రుద్రవరం): సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా యల్లావత్తుల, పెద్దకంబలూరు గ్రామాల రైతులకు విషపు ఎర్రన పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ తెలిపారు.

అవుకు: అవుకులో బుధవారం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన వానకు వ్యాపారులు, వినియోగదారులు వారపు సంతలో ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారు.

కోవెలకుంట్ల: ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై మల్లికార్జునరెడ్డి కోరారు. కోవెలకుంట్లలోని వీధుల్లో స్పెషల్ పార్టీ పోలీసులతో ఆయన రూట్ మార్చ్ నిర్వహించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: తనను విధుల నుంచి తప్పుకోవాలని వేధిస్తున్నారని కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నెకు చెందిన వీవోఏ (పొదుపు) పద్మజ బుధవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ నెల 1 నుంచి తన స్థానంలో వేరొకరిని నియమిస్తున్నట్లు వెలుగు సీసీ గోపాలకృష్ణ తెలిపారన్నారు.

నల్లగట్ల(ఆళ్లగడ్డ గ్రామీణం): గొర్రెల పెంపకందార్ల ప్రాథమిక సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంఘం వైస్ ఛైర్మన్ శూలం గుర్రప్ప యాదవ్ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా గొర్రెల పెంపకందార్ల ప్రాథమిక సహకారం సంఘం ఎన్నికల్లో వైస్ ఛైర్మన్‌గా ఆయన ఎన్నికయ్యారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషాపై రెండు ప్రైవేట్ కేసులు నమోదయ్యాయని న్యాయవాది, డోన్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం డోన్ కోర్టు ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు.

# నిధులు విదల్చని నిర్లక్ష్యం

✦ అభివృద్ధి పనులను పట్టించుకోని వైకాపా
✦ పురంలో రూ.3 కోట్లకు పైగా పనుల రద్దు
✦ కూటమిపైనే జనాల ఆశలు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని 32 వార్డుల్లో పలు అభివృద్ధి పనులు ఆగిపోవడంతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వాటిపై దృష్టి సారించి పనులు జరిగేలా చూడాలని కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొన్నింటికి ఆమోదం తెలిపి నిధులు విదల్చకపోవడంతో ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి. సీఎండీఎఫ్, జీజీఎంపీ, డీఎంఎఫ్, కుడా, సాధారణ నిధుల కింద పలు పనులకు టెండర్లు వేసి గుత్తేదారులతో చేపట్టిన పనులకు నిధులు రాక ఇవి ఆగిపోయాయి. ఇంకొన్ని రద్దయ్యాయి. రూ.3 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండగా... గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో జనాలకు అవస్థలే మిగిలాయి.

### నిలిచిన నిర్మాణ పనులు

పుర పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక గ్రాంటు కింద 6.40కోట్లు మంజూరు చేశారు. వాటితో సీసీరోడ్లు, కాలువలు, కల్వర్టులు లాంటి 85 నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో 46 పనులు పూర్తి చేయగా...39 రకాల పనులు రూ.2.40 కోట్ల విలువైనవి నిలిచిపోయాయి. ☛ డీఎంఎఫ్ కింద రూ.75 లక్షలు మంజూరు కావడంతో కొత్తపస్తుల సమీపంలో నుంచి ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు సీసీ డ్రైన్ నిర్మాణం చేపట్టారు. ఇందులో సీసీ డ్రైన్‌కు రూ. 40లక్షల వరకు ఖర్చు చేయగా, మరో రూ. 35 లక్షలతో సీసీ కాలువ పనుల్ని చేపట్టాల్సి ఉండగా అధికారులు చెబుతుండగా, నిధుల లేమి వల్ల ఇలాంటి పరిస్థితి తలెత్తిందని చెబుతున్నారు.

### రూ.కోట్ల పనులకు ఇక్కట్లు

2022 నుంచి 2024 వరకు పలు పథకాల కింద మంజూరైన పనులకు సంబంధించి కొన్ని నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో అవన్నీ రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. పట్టణంలోని ఉపరితల వంతెనకు సంబంధించిన గోడలకు పెయింటింగ్ వేసేందుకు సాధారణ నిధుల కింద రూ. 91 లక్షలు మంజూరైనా...నిధులు విడుదల కాకపోవడంతో వాటిని రద్దు చేశారు. ☛ 'కుడా' కింద రూ. 40 లక్షలు మంజూరు కాగా వాటితో కళ్యాణి ఎస్టేట్‌లోని పురపాలిక పార్కుల్లో ప్రహరీ గ్రిల్ వర్క్స్, కిడ్స్ పరికర్, గ్రాసం, మొక్కలు నాటడం వంటివి జరగకపోవడంతో రద్దు చేశారు. ☛ ఉపరితల వంతెన కింద తాత్కాలిక దుకాణాల నిర్మాణాలకు రూ.70 లక్షలు జనరల్ ఫండ్ కింద మంజూరు చేసినా జరగకపోవడంతో వాటిని రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ☛ 2022లో ముఖ్యమంత్రి అభివృద్ధి నిధుల (సీఎండీఎఫ్) కింద రూ. 50లక్షలు మంజూరు కాగా...ఎనిమిది పనులకు గాను టెండర్లు వేసి సంబంధిత గుత్తేదారులతో కొత్త ఇందిరానగర్‌లో రూ. 3.20లక్షలతో సీసీ డ్రైన్, శ్రీరామనగర్‌లో రూ. 15.60 లక్షలతో సీసీ రోడ్డు, స్టేడియం పక్కన రూ. 3.50లక్షలతో సీసీ డ్రైన్, కొండపేటలో రూ.18 లక్షలతో సీసీ రోడ్డు వంటి పనులు చేపట్టారు. ఇంకా రూ. 5.30లక్షలతో ఇందిరానగర్‌లోని ప్రైవేట్ పాఠశాల సమీపంలో సీసీ డ్రైన్, కల్వర్టు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా.. నిధులు దీన్ని రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై గుత్తేదారు కోర్టుకు వెళ్లినట్లు తెలుస్తోంది. ☛ పురపాలక పరిధిలోని జీజీఎంపీ కింద ఒక్కో వార్డుకు రూ. 10లక్షల చొప్పున రూ. 3.20 కోట్లు మంజూరవ్వగా, 65 పనులకు గాను 15 చోట్ల నిధులు లేక అన్నింటినీ రద్దు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.



కల్వర్టు లేక రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

### నిధులు మంజూరైతే నిర్మాణాలకు కృషి

– సురేష్, మున్సిపల్ ఏఈ, డోన్

పురపాలక పరిధిలో వివిధ పథకాల కింద మంజూరైన నిర్మాణ పనులకు సంబంధించి 25 శాతం లోపు ఉన్నవి ఏవైతే ఉన్నాయో అవన్నీ రద్దయ్యాయి. వాటిని కౌన్సిల్‌లో పెట్టి రద్దు చేస్తాం. 25 శాతానికి పైగా నిర్మాణ పనులు చేసిన వాటిలో మిగిలిన వాటికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే ఆయా పనులు చేపట్టేందుకు కృషి చేస్తాం.

## వైభవంగా వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: కోటపాడు గ్రామంలో బుధవారం కొత్తగా నిర్మించిన వీరభద్రస్వామి కోవెలలో వీరభద్రస్వామి విగ్రహప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. అర్చకులు అన్నవర్జుల విరూపాక్షశాస్త్రి ఆధ్వర్యంలో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేపట్టారు.



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు



చాగలమర్రి: బిందెసేవ నిర్వహిస్తున్న ఆర్యవైశ్య యువకులు



నందవరం చౌడేశ్వరి



అవుకులో కలశాల ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

## అమ్మా! భవానీ...ఓంకార రూపిణి

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని భక్తిశ్రద్ధలతో భక్తులు కొలిచారు. వివిధ రూపాల్లో అలంకరించిన అమ్మవారిని మనసారా మొక్కుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి...తమను ఆశీర్వదించమని భక్తులు పూజించారు. –న్యూస్‌టుడే బృందం.



బేతంచెర్లలో అమ్మవారిని దర్శించుకున్న మహిళలు



సంజామలలో బిందె సేవ



సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు

# రూ.5 భోజనం అందిస్తున్న ఘనత చంద్రబాబుదే!

◆ అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: తమది ప్రజా ప్రభుత్వమని, ప్రజల కోసమే పనిచేస్తుందని, రూ.5 భోజనం అందిస్తున్న ఘనత చంద్రబాబుదేనని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. బుధవారం పట్టణంలోని పాత బస్టాండులో అన్న క్యాంటీన్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పేదల ఆకలి తీర్చే ఇటువంటి కార్యక్రమాలు వైకాపా చేపట్టలేదని, తాము మాత్రం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామన్నారు. ఆళ్లగడ్డలో త్వరలోనే రెండో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని, దాతలు ఎవరైనా ముందుకు వచ్చి వారి పెద్దల జ్ఞాపకార్థమో, శుభ కార్యక్రమాల సందర్భంగానో అన్న క్యాంటీన్ ద్వారా పేదల ఆకలిని తీర్చవచ్చన్నారు. ఒకవైపు వైకాపా సర్పంచులు, ప్రజాప్రతినిధులు మండల, పంచాయతీ, కౌన్సిల్ సమావేశాలకు హాజరు కావడం లేదని, మరోవైపు ఆర్థిక సంఘం నిధులు ఇవ్వడం లేదంటూ వారే ఆరోపిస్తుండటం సబబుగా లేదన్నారు. పురపాలక ఛైర్మన్ డా.రామలింగారెడ్డి, వైస్‌ఛైర్మన్ నాయబ్ రసూల్, కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, జనసేన నాయకుడు మైలేరి మల్లయ్య, కౌన్సిలర్ హుస్సేన్ బాషా, సి.శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

## న్యాయం జరిగేలా చూడాలి

డోన్, న్యూస్‌టుడే: దళితుల ఫిర్యాదులపై స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు బొందిమడుగుల టీఎంరమేష్ పేర్కొన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. డీఎస్పీ మాట్లాడుతూ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. శ్రీనివాసులు, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసులును సన్మానిస్తున్న నాయకులు

## హత్యా రాజకీయాలకు వైకాపా ప్రోత్సాహం: తెదేపా

డోన్, న్యూస్‌టుడే: హత్యా రాజకీయాలను వైకాపా ప్రోత్సహిస్తోందని తెదేపా రాష్ట్ర కార్యదర్శులు నాగేశ్వరరావుయాదవ్, వలసలరామకృష్ణ ఆరోపించారు. బుధవారం నాగేశ్వరరావుయాదవ్ స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తెదేపా మండల అధ్యక్షుడు సలీంద్ర శ్రీనివాసులు, మిద్దెపల్లెగోవిందు, జయరాముడు, ఈశ్వరయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల వారికి బీమాతో మేలు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం గ్రామీణ తపాలా జీవిత బీమాను భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తపాలాశాఖ ఐపీవో చంద్రమౌళేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ తపాలాశాఖ వారోత్సవాలను పురస్కరించుకుని ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది తాత్కాలిక బ్రాంచి పోస్టుమాస్టర్ పద్మావతి అధ్యక్షతన స్థానిక కార్యాలయం నుంచి బుధవారం స్థానిక పాతబస్టాండులోని గాంధీ విగ్రహం ర్యాలీ వరకు చేపట్టారు. గాంధీ విగ్రహం వద్ద తపాలాశాఖ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కాంతారెడ్డి, అనురాధ, సువర్ణమ్మ, తిమ్మారెడ్డి, నాయక్, పోస్టల్ ఏజెంట్ నాయకుడు వీకే రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా ఉద్యోగులు, సిబ్బంది

## ఈవోగా బాధ్యతల స్వీకరణ



బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి మేజర్ పంచాయతీ ఈవోగా సతీష్ కుమార్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసే హరిప్రసాద్ అవుకు మేజర్ పంచాయతీకి బదిలీ అయ్యారు.

## ఉద్యాన పంటలపై అవగాహన పెంచుకోవాలి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలో సాగవుతున్న ఉద్యాన పంటలు ఉల్లి, మామిడి, చీని, అరటి, మిరప, టమాటాపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నాగరాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎంబాయి, సీతారామాపురం తదితర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.



సూచనలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

## రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: మండల పరిధిలోని గ్రామాల్లో రైతులు ఖరీఫ్‌లో భాగంగా సాగు చేసిన వివిధ పంటల ఈనమోదు పాటు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ తెలిపారు. మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఈకేవైసీ నమోదుపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## ఆళ్లగడ్డను ఉత్తమ స్థానంలో నిలిపేందుకు కృషి

చాగలమర్రి, న్యూస్‌టుడే: క్రీడల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని ఉత్తమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని నంద్యాల జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆళ్లగడ్డ తెదేపా యువనాయకుడు భూమాజగత్‌విఖ్యాత్‌రెడ్డి తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 53వ రాష్ట్రస్థాయిహ్యాండ్‌బాల్ సీనియర్ మెన్ ఛాంపియన్‌షిప్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. తెదేపా మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్ బాషా, పాఠశాల కమిటీ ఛైర్మన్ జల్లాగౌస్, తెదేపా నాయకులు కొలిమి ఉసేన్‌వలి, ఎస్.నాగరాజు, కొలిమి షరీఫ్, జెట్టినాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న భూమాజగత్‌విఖ్యాత్‌రెడ్డి

## నిండా గోతులు..తీరని ఇక్కట్లు



బనగానపల్లి మండల పరిధిలోని గులాంనబిపేట, కైప రహదారి గుంతలతో నిండిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైల్వే వంతెన వద్ద పెద్దగా గుంతలు ఉండటంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, గులాంనబిపేట (బనగానపల్లి గ్రామీణం)

## దారి నిండా దుమ్ము



ఆ దారిలో ప్రయాణిస్తే దుమ్ము లేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డోన్ నుంచి కొచ్చెర్వుకు వెళ్లే రహదారిలో వాహనదారులు పట్టపగలే దీపాలు వేసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ రహదారులను బాగు చేసి వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, డోన్

# అసౌకర్యాలతో సతమతం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో పలు సమస్యలు వేధిస్తుండటంతో స్థానికులు అవస్థలపాలవుతున్నారు. గత ప్రభుత్వం ఎటవంటి నిధుల్ని విదల్చక ఎక్కడికక్కడ ప్రగతిదాయక పనులు చేపట్టలేకపోవడంతో ఇబ్బందులతో జీవనాన్ని సాగిస్తున్నామని వాపోతున్నారు.

స్వామినగర్ కాలనీలో...: స్వామినగర్ కాలనీలో సుమారు 500కుటుంబాలు పైగా ఉన్నాయి. గత ప్రభుత్వం అయిదేళ్లల్లో ఒక్క అభివృద్ధి పనినీ చేపట్టలేదు. సీసీ రహదారులు నిర్మించకపోవడంతో రాళ్లు తేలిన దారుల్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. కాలువలు లేక నివాసితులు ఇబ్బందులుపడుతున్నారు. వర్షాలు కురిస్తే ఇళ్లలోకి నీరంతా చేరడంతో అవస్థలు పడుతున్నామని, ఇళ్ల మధ్యనే మురుగు నిలుస్తుండటంతో దోమల బెడద ఎక్కువైందని, దారుల వెంట ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు పెరిగాయని చెబుతున్నారు. కాలనీలోని కుళాయిలకు కుందూనది నుంచి నేరుగా నీటిని సరఫరా చేస్తుండటంతో రంగుమారిన..దుర్వాసన వస్తున్న నీటినే తాగాల్సి వస్తోందని వాపోతున్నారు. సెబ్ కార్యాలయం వెనుక ఉన్న వీధిలో దీపాలు లేక చీకట్లలోనే రాకపోకలు సాగిస్తున్నామంటున్నారు. పోలీసుస్టేషన్ వెనకాల ఉన్న కాలనీ సమీపంలో మట్టి గుంతల్లో భారీగా మురుగు చేరడంతో దుర్వాసన వస్తోందంటున్నారు. కాలనీకంతా కలిపి ఒకే ఒక శుద్ధజల కేంద్రం ఉండటంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయంటున్నారు.

ఏళ్లు గడుస్తున్నా.. ఇబ్బందులే: సుమారు 14ఏళ్ల కిందట ఇందిరమ్మ కాలనీలో 1600మంది పేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇచ్చింది. ఇప్పుడు ఈ కాలనీలో సుమారు 500కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. మౌలిక వసతుల్ని మాత్రం కల్పించలేకపోయారు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో బీసీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నిర్మించిన సీసీ రహదారులు తప్ప వైకాపా హయాంలో కొత్తగా ఒక్క సీసీ రహదారి కానీ, మురుగు కాల్వ కానీ నిర్మించలేదని నివాసితులు వాపోతున్నారు. వర్షా కాలంలో అంతర్గత దారులన్నీ బురదమయంగా మారుతున్నాయని, కాలువల వసతి లేక మురుగునీరంతా ఇళ్ల మధ్య నిల్వ ఉంటోందని చెబుతున్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బీసీ శుద్ధజల కేంద్రాన్ని నిర్మించారని, ఇప్పుడు ఈ కేంద్రం దాదాపు ఏడాదిన్నరగా పని చేయడం లేదని, తాగునీటి కోసం కాలనీవాసులు దూరంగా ఉన్న కాలనీలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు.



స్వామినగర్ కాలనీలోని వీధుల్లో దారుల దుస్థితి

## చేగువేరా ఆశయ సాధనకు కృషి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ప్రపంచ విప్లవ వీరుడు పోరాట యోధుడు చేగువేరా ఆశయ సాధనకు ప్రతివిద్యార్థి కృషి చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ అన్నారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చేగువేరా వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## విధుల్లో ఉండి మరణిస్తే ఉద్యోగం ఇవ్వాలి

డోన్, న్యూస్‌టుడే: మున్సిపల్ విధుల్లో ఉండి కార్మికులు మరణిస్తే వారి కుటుంబంలోని ఒకరికి ఉద్యోగంతో పాటు ఆర్థికసాయం అందించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ సప్తశైలరాజేష్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్ల సమస్యల పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అబ్బాస్, పుల్లయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## శిల్పా వెంచర్ పరిశీలన



కేసీ అధికారులతో చర్చిస్తున్న జేసీ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలో శిల్పా వెంచర్‌ను బుధవారం జేసీ విష్ణుచరణ్ పరిశీలించారు. ఆయన కేసీ అధికారులతో వెంచర్‌లో పంట కాల్వల దారి మళ్లింపుపై మాట్లాడారు. కాల్వల అలైన్‌మెంట్ మార్పు ఎక్కడ మొదలైంది, వాటికి అనుమతులు ఎలా వచ్చాయి, మార్పుతో ఏ రకమైన అంశాలు ప్రభావితమయ్యాయి లాంటివన్నీ చర్చించారు. దస్త్రాలను పరిశీలించారు.